జలం.. గరళం

తాగునీరులో మురుగునీరు కలిసి కలుషితమవుతన్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో బుక్కావీధివాసులు ఆందోళన చెందుతున్నారు. మల మూత్రాలు కలిసిపోతుండటంతో ఈ నీరు తాగేదెలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలారోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా.. ఇక్కడి ప్రజలు అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవుతున్నా కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు మొరపెట్టుకుందామన్నా స్థానిక కూటమి నాయకులు అడ్డు తగలడంతో తమ సమస్య పరిష్కారమయ్యేదెలా అని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

డ్రైనేజీల్లో మంచే పైపులు | కలిసిపోతున్న మురుగునీరు | మంచం పడుతున్న స్థానికులు | పట్టించుకోని పాలకులు, అధికారులు


మురుగునీటిలోనే మంచినీటి కుళాయి పైపులైన్లు


తాగునీటిలో కలిసిపోయిన మురుగు నీటిని బాటిల్స్‌లో నింపి చూపిస్తున్న స్థానికులు


భూగర్భ డ్రైనేజీ ఇలా..

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 38వ వార్డు పరిధి బుక్కా వీధిలో కొంతకాలంగా తాగునీటి పైపుల ద్వారా మురుగునీరు వచ్చేస్తోంది. మల, మూత్రాలు కూడా కలుస్తున్నాయని ఈ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా ఈ ప్రాంతంలో అనేక మంది రోగాలబారిన పడ్డారు. వారిలో కొందరు ఆస్పత్రిపాలవగా.. మరికొందరు ఇంటి వద్ద మంచంపట్టారు. ఇంత జరుగుతున్నా.. అధికారుల్లో స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై పలు మార్లు అధికారుల దృష్టికి తీసు


కొత్త అగ్రహారంలో పరిస్థితి ఇదీ..

కెళ్లినా పట్టించుకోలేదని, దీంతో ఆ మురుగునీటినే తాగాల్సి వస్తోందంటూ ఆవేదన చెందుతున్నారు.

దుర్గంధం భరించలేం..

మేమున్నది మురికివాడ ప్రాంతం. కాల్వల్లో పేరుకుపోయిన చెత్త చెదారాలను ఎప్పటికప్పుడు తీయరు. దీంతో ఎక్కడికక్కడ మురుగు నీరు నిలిచిపోతుంది. పైపులైన్ల ద్వారా సరఫరా అయ్యే మంచినీటిలో మురుగు నీరు కలిసిపోతోంది. తాగునీటి వల్ల అనారోగ్యానికి గురవుతున్నాం. కంపు భరించలేకపోతున్నాం.

– సూరీడమ్మ, స్థానికురాలు

ఉన్నతాధికారుల వద్దకు వెళ్లనివ్వడం లేదు

మా సమస్యను కలెక్టర్‌కు మొర పెట్టుకుందామంటే స్థానిక కూటమి నాయకులు మమ్మల్ని వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారు. సమస్యలు పరిష్కరించరు. పరిష్కారం కోసం అధికారుల వద్దకు వెళ్లనివ్వరు. ఇలాగైతే మా సమస్యలు తీరేదెలా?

– చిన్నతల్లి, స్థానికురాలు

ఆ వార్డులో అంత స్పందన.. మాకే ఎందుకిలా?

ఇటీవల ఇలాంటి ఘటనలే వార్డుకు అనుబంధంగా ఉన్న 37వ వార్డు జబ్బరతోటలో జరగడంతో పలువురు డయేరియా బారిన పడ్డారు. ఆగమేఘాలపై స్పందించిన జీవీఎంసీ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు చేపట్టారు. కానీ తమ ప్రాంతాన్ని ఇటు కార్పొరేటర్ గాని, అటు జీవీఎంసీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదని బాధ పడుతున్నారు. తమను పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు. సమస్య తీవ్రంగా ఉండటంతో సోమవారం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు స్థానికులు సిద్ధమయ్యారు. కానీ వారిని వెళ్లనివ్వకుండా స్థానిక కూటమి నాయకులు అడ్డు తగలడం గమనార్హం

మత్స్యకారులంటే చిన్నచూపు



మేమంతా మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వాళ్లం. అందుకే కార్పొరేటర్‌కు, జీవీఎంసీ అధికారులకు చిన్నచూపు. చాలాకాలంగా మంచినీటి కుళాయి ద్వారా డ్రైనేజీ (మల, మూత్రం) నీరు కలిసిపోతుంది. గత్యంతరం లేక ఆ నీటినే తాగి రోగాలపాలవుతున్నాం. ఈ విషయంపై అధికారులకు వినతిపత్రం అందజేశాం. అధికారులు వచ్చి చూశారు. కానీ సమస్య పరిష్కరించలేదు. కుళాయి వచ్చిన 10 నిమిషాలు మల..మూత్రాలు తప్ప మంచినీరు రావడం లేదు. ఇచ్చే అరగంటలో సగం నీరు రోడ్డు పాలవుతోంది. ఒక్కో కుళాయి మీద 10 నుంచి 15 కుటుంబాలు నీరు పట్టుకుంటున్నాయి. – కర్రి చంద్రశేఖరం, అధ్యక్షుడు, ఏపీ మత్స్యకారుల సంఘం

క్లుప్తంగా

సీతారాములకు ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో శ్రీ సీతారాముల కల్యాణం జరిగి 16 రోజులైన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవశర్మ ఆధ్వర్యంలో సోమవారం విశేష పూజలు జరిపారు. భక్తుల గోత్రనామాలతో విశేష అర్చనలు, అభిషేకాలు చేపట్టారు.

ఇమ్మానుయేల్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ఆరాధన

దాబాగార్డెన్స్: నగరంలోని ఇమ్మానుయేల లూథరన్ చర్చిలో ఈస్టర్‌ను పురస్కరించుకొని ప్రత్యేక ఆరాధన, ఏసుక్రీస్తు పునరుత్థాన జాగరణలు నిర్వహించినట్టు చర్చి పాస్టర్ ఇసుకపాటి శ్యామ్‌కుమార్ పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ సందర్భంగా జాగరణ, దివ్యపూజా బలులు, ప్రార్థనలు నిర్వహించినట్టు చెప్పారు. ఏఈఎఎల్‌సీ సంస్థకు పూర్వ వైభవం సంతరించుకునేలా పనిచేస్తున్నామని, సంస్థ అభివృద్ధికి ప్రతి సభ్యుడు సహకరించాలని కోరారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

54 మంది సభ్యుల చేరిక


కొత్తగా చేరిన సభ్యులతో అసోసియేషన్ ప్రతినిధులు

అల్లిపురం: మహా విశాఖ నగరపాలక సంస్థ దఫేదార్ అసోసియేషన్‌లో 54 మంది సభ్యులు చేరినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈతలపాక గణపతి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని జెమ్స్ హాల్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు యు.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. ఏపీ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అక్కరబోయిన అప్పలరాజు, కోశాధికారి ఎం.రవి, అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ ఇ.అప్పలరాజు, జీవీఎంసీ అన్ని విభాగాల్లో పనిచేస్తున్న జీవీఎంసీ దఫేదర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలని వినతి


వీఎంఆర్‌డీఏ చైర్మన్‌కు సమస్య వివరిస్తున్న పైడిరాజు తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ ఏడో వార్డు, మానం ఆంజనేయులు కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు మూసివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు కోరారు. కాలనీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్‌తో కలిసి సోమవారం వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కాలనీలో సర్వే నంబర్ 126/4లో గల భూమి తనదంటూ ఓ వ్యక్తి దౌర్జన్యంగా రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మించడంతో ఎగువ నుంచి వచ్చే మురుగు దిగువకు వెళ్లకుండా నిల్వ ఉండిపోతోందన్నారు. దీంతో కాలనీవాసులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్‌ను కలసిన వారిలో కాలనీ సభ్యులున్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళి

కంచరపాలెం: పోప్ ఫ్రాన్సిస్ మరణానికి చింతిస్తూ జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ వార్డు కార్యాలయం వద్ద నివాళులు అర్పించారు. కార్పొరేటర్ పూర్ణిమ మాట్లాడుతూ యావత్ క్రైస్తవ లోకానికి మార్గ చూపరి, దైవ సేవకుడు అయిన పోప్ ఫ్రాన్సిస్ మరణం క్రైస్తవ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

విద్యార్థులు ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలి


ప్రొఫెసర్ యాగంటిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, అధ్యాపక బృందం

దాబాగార్డెన్స్: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(న్యూఢిల్లీ) ప్రొఫెసర్, ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ యాగంటి చిన్నారావు సోమవారం ఏవీఎన్ కళాశాల విద్యార్థులతో ఇంట్రాక్షన్ అయ్యారు. ప్రతి విద్యార్థి అందివచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ దేశ రక్షణ, పురోభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ యాగంటి చిన్నారావు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహించడం మన కళాశాలకు ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులు ఆయన్ని స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ యాగంటిని అధ్యాపక బృందం సత్కరించింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డీన్ శంకరనారాయణరావు, పొలిటికల్ విభాగాధిపతి జె.రామారావు, అనంతలక్ష్మి, డి.గాయత్రి, లావణ్య, బీఎస్ మూర్తి, ప్రసన్న పలువురు అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం


అర్జీలు స్వీకరిస్తున్న జోన్–5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మూడు వినతులు అందినట్లు జోనల్ కమిషనర్ బి.రాము తెలిపారు. టౌన్ ప్లానింగ్‌కు 2, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున పలువురు అర్జీలు సమర్పించారన్నారు. వినతులను జెడ్సీ పరిశీలించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, దిలీప్‌కుమార్, భరణి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ పనులు సత్వరం పూర్తి చేయాలి


అధికారులకు సూచనలు చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాఖ సిటీ: మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, వాణిజ్య సముదాయ భవనం, హెలీకాప్టర్ మ్యూజియానికి సంబంధించిన అన్ని పనులను ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అధికారులను ఆదేశించారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వాటిని ప్రారంభించనున్న నేపథ్యంలో సోమవారం ఈ రెండు ప్రాజెక్టులను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిన పనులు ఏమైనా మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. ఈ పర్యటనలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఎస్‌ఈలు భవానీశంకర్, బలరామరాజు, ఈఈలు మధుసూదన్, రామరాజు, దుర్గాప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

భగభగ మండే

భానుడు సోమవారం చండ ప్రచండుడే అయ్యాడు. ఆ వేడికి తట్టుకోలేక నగరవాసులు చాలావరకు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో జనసంచారం లేక రహదారులు కర్ఫ్యూను తలపించాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దాదాపు ఇదే పరిస్థితి. కేవలం షర్బత్ బళ్లు, శీతల పానీయాల దుకాణాల వద్ద మాత్రం పాదచారులు, వాహనచోదకులు చల్లని పానీయాలు సేవిస్తూ, సేదతీరుతూ కనిపించారు.

– అల్లిపురం


నిత్యం రద్దీగా ఉండే గీత్ సంగీత్ రోడ్డు నిర్మానుష్యంగా ఇలా..


ఉదయం 11.30 గంటలకు జనసంచారం పలచగా ఉన్న అల్లిపురం గాంధీబొమ్మ జంక్షన్


శీతల పానీయాల దుకాణం వద్ద సేద తీరుతున్న వాహన చోదకులు


జనసంచారం లేక బోసిపోయిన బీఆర్ రెడ్డి జంక్షన్

కొత్త పైపులైన్ ఏర్పాటుకు జెడ్సీకి వినతి

అల్లిపురం: యాభై ఏళ్లనాటి మంచినీటి పైపులైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని 33వ వార్డు మాజీ కార్పొరేటర్ పచ్చిరిపల్లి లక్ష్మీరాము జోనల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వార్డులో అల్లిపురం, కుమ్మరవీధి, వెంకటేశ్వరమెట్ట ప్రాంతంలో పాత పైపులైన్ పాడవటంతో మంచినీటి ధార తగ్గి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పాతపైపు లైన్ తుప్పుపట్టి పాడవటంతో నీరు వృథా అవుతోందని తెలిపారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ ఇంజినీరింగ్ సిబ్బందిని పంపి పరిశీలిస్తామని తెలిపారు. పాత పైపులైను స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారని తెలియజేశారు.

ఎక్కడి చెత్త అక్కడే..


సీపీఐ కార్యాలయం వద్ద పేరుకుపోయిన చెత్త

అల్లిపురం: జీవీఎంసీ 32వ వార్డు నేరెళ్లకోనేరు కాలనీ సీపీఐ కార్యాలయం వద్ద చెత్త పేరుకుపోయింది. నాలుగు రోజులుగా చెత్త తొలగించకపోవటంతో ఈ ప్రాంతం అంతా దుర్వాసన వస్తోందని స్థానికులు తెలిపారు. చెత్త గుట్టలుగా పేరుకుపోవడంతో అటువైపు వెళ్లాలంటే ముక్కు మూసుకోవలసి వస్తోందన్నారు. జీవీఎంసీ సిబ్బంది స్పందించాలని, తక్షణమే చెత్త తొలగించాలని కోరారు.

చందనోత్సవంలో బాలలకు సౌకర్యాలు కల్పించాలి

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి వచ్చే బాలలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం సోమవారం ఓ ప్రకటనలో సూచించారు.

చిన్నారులకు వారి తల్లులు పాలు పట్టేందుకు వీలుగా క్యూల్లో తగినన్ని ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. బాలలకు మంచి నీరు, వేడి పాలు, బిస్కెట్లు అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దివ్యాంగ పిల్లలకు ప్రత్యేకంగా దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తప్పిపోయిన పిల్లలను త్వరితగతిన వారి తల్లిదండ్రులకు అప్పగించేలా పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమశాఖ, చైల్డ్‌లైన్ సహాయ సహకారాలు తీసుకోవాలని సూచించారు.

యథావిధిగా జంగిడీల ఏర్పాటు


పూర్ణామార్కెట్ వద్ద దుకాణాల ఏర్పాటుకు పెట్టుకుంటున్న జంగిడీలు

జగదాంబ: ఎట్టకేలకు పూర్ణామార్కెట్‌లో చిరు వ్యాపారులకు జంగిడీలు పెట్టి బతుకుతెరువు ఇచ్చారు. మూడు నెలలుగా జీవీఎంసీ, వన్‌టౌన్ పోలీసులు కలసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రహదారిపై దుకాణాలను తొలగించిన విషయం తెలిసిందే. దీని వెనుక కూటమికి చెందిన నాయకులు దుకాణాలు తొలగించినట్టు వ్యాపారులు భావించారు. అనుకున్నట్టే మళ్లీ ఆదే నాయకులు సోమవారం సాయంత్రం యథావిధిగా దుకాణాలను పెట్టించారు. నాయకులు కలసి అధికార బలంతో చేసిన ఈ పనికి నోట్లు చేతులు మారినట్టు తెలిసింది. కార్ల పార్కింగ్ వెనుక భాగంలో మార్కింగ్ చేసి, ఒక్కొక్క వ్యాపారికి ఒక్కొక్క దుకాణం చొప్పున పెట్టించారు.

వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన


మాట్లాడుతున్న పరిషత్ జాతీయ అధ్యక్షుడు వికాష్ పాండే

దాబాగార్డెన్స్: నగరంలోని ఎంకే గోల్డ్‌కోస్ట్ క్లబ్ హౌస్‌లో సోమవారం వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వినియోగదారుల హక్కుల పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పరిషత్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాష్‌పాండే పాల్గొని మాట్లాడారు. కన్స్యూమర్ ప్రొటెక్షన్ 2019 చట్టం, ఆహార భద్రత, తూనికలు, కొలతలు, ఔషధ నియంత్రణతోపాటు వినియోగదారులకు సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖల పనితీరు గురించి వివరించారు. వినియోగదారులకు ఏమైనా సమస్యలు ఎదురైతే 9963633653 నంబరును సంప్రదించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల గురించి పూర్తి అవగాహన కల్పించిన వికాస్‌పాండేను ఎంకేగోల్డ్ అపార్టుమెంట్ అసోసియేషన్ సెక్రటరీ రజనీకాంత్ అభినందించారు. కార్యక్రమంలో పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, జాతీయ కమిటీ సభ్యుడు డాక్టర్ త్రినాథ్, కౌన్సిల్ సభ్యులు, పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

‘మా కార్పొరేటర్ డైనమిక్’


కార్పొరేటర్ తోట పద్మావతిని సత్కరిస్తున్న నాయకులు

అల్లిపురం: జీవీఎంసీ మేయర్ పీఠం కైవసం చేసుకునేందుకు అధికార పార్టీ నాయకులు ప్రలోభాలకు గురి చేసినా లొంగని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి డైనమిక్ అంటూ ఆ వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలు కొనియాడారు. ఆమెను ఎర్నిమాంబ దేవస్థానం చైర్మన్ లండా రమణ, వార్డు నాయకులు లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, వాసుపల్లి అప్పారావు, సీహెచ్ సత్తిరాజు, అనిల్ కుమార్, కార్యకర్తలు సోమవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ టీడీపీ నాయకుల ప్రలోభాలకు లొంగకుండా వైఎస్సార్‌సీపీకి పద్మావతి అండగా నిలిచారని ప్రశంసించారు. పోలీసులతో ఫోన్లు చేయించి, ఇంటికి వచ్చి బెదిరింపులకు పాల్పడినా వెరవక, మాటకు కట్టుబడి ఉన్న ఆమె ఆత్మస్థైర్యాన్ని అభినందించారు. నియోజకవర్గంలో నాయకులకు, కార్యకర్తలకు ఆమె స్ఫూర్తిగా నిలిచారన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

సీతమ్మధార: లిటిల్ ఏంజిల్స్ స్కూల్ యాజమాన్యం అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ప్రైవేట్ కాలేజెస్, స్కూల్స్, స్టాఫ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో తొలగించిన కార్మికులతో కలసి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తొలగించిన 15మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని లేబర్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను యాజమాన్యం పట్టించుకోవడం లేదని, దీనిపై చర్య తీసుకోవాలని కోరారు. పాఠశాల యాజమాన్యం తీరుకు నిరసనగా కార్మికులు నినాదాలు చేశారు.

ఎంపీ దృష్టికి కార్యదర్శుల సమస్యలు

దాబాగార్డెన్స్: వార్డు పరిపాలనా కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్డు పరిపాలన కార్యదర్శుల సంఘం నాయకులు విశాఖ ఎంపీ భరత్ దృష్టికి తీసుకువచ్చారు. జాబ్‌లో జాయిన్ అయినప్పటి నుంచి జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్స్‌తో పాటు ప్రొబేషన్ కాలం పూర్తయిన రెండు సంవత్సరాల కాల పరిధిని సర్వీస్‌లోకి పరిగణనలోకి తీసుకోవాలని ఆ వినతిలో పేర్కొన్నారు. ఎంపీని కలిసిన వారిలో సంఘం ఉపాధ్యక్షుడు పి.జె. గణేష్‌కుమార్, కోశాధికారి చింతకాయల బంగార్రాజు, విశాఖ జిల్లా నాయకులు శివనారాయణ, అనీల్‌ప్రకాష్, సాయి కృష్ణ, నానాజీ ఉన్నారు.